# పెరటి చెట్టు కథ

పెరటి చెట్టు మందుకు పనికిరాదు.

దేశాన్ని తిండి విషయంలో స్వయం సమృద్ధి చేద్దామనుకుంది అప్పటి ప్రభుత్వం. అప్పటికింకా గరీబీ హటావో' రాలేదు. కనీసం 'ఆకలి హటావో' అని కూడా అనలేదు. ఆ రోజుల్లో ఇంకా స్లోగన్సుకి ప్రాముఖ్యత రాలేదు. దాని బదులు 'స్లో ప్రోగ్రెస్‌కే' ప్రాముఖ్యత ఉండేది. అయితే ప్రభుత్వానికింకా ఆత్మవిశ్వాసం లేదు. దేశనాయకులు ప్రతి అడ్డమైనదానికీ విదేశీ నిపుణులమీద ఆధారపడుతూ ఉండేవారు. దేశీయ నిపుణులు అన్న కోడళ్లు అన్నీ అమర్చాక విదేశీ నిపుణులనే అత్తగార్లు చెయ్యి పెడుతుండేవారు. ఒకొక్కసారి అమర్చినవి ఒలకబోసి కొత్తవి చెయ్యమనేవారు. అలాంటి కథ ఇది.

కరువుతో బాధపడుతున్న నందగిరి రాష్ట్రంలో నందిని నదికి డామ్‌కట్టి ఒక్క చుక్క నీరు వృధా కాకుండా చూడాలని ప్రభుత్వం అనుకుంది. భారతీయ ఇంజనీర్లు గబ గబా కొండలు కోనలు ఎక్కి సర్వేలు చేసారు. సినీ కష్టాలు పడ్డారు. మలేరియాలు తెచ్చుకున్నారు. ఆ రోజుల్లో వాళ్లందరికి పేట్రియాటిజం పేట్రేగి పోయి వుంది. దేశాన్ని త్వరగా సంపన్న దేశంగా మార్చాలన్న కోర్కె అందరికి బలంగా ఉండేది. ఎంత కష్టపడితే స్వతంత్రం వచ్చిందో అందరికి గుర్తుంది.

ఇంజినీర్లు సర్వే చేసి అయిదారు స్థలాలు డామ్ కట్టడానికి అనుకూల స్థలాలుగా సూచించారు. వాటిలో భూగర్భ శాస్త్రజ్ఞులు పరీక్షించి ఫాల్టులు గ్రట లేకుండా ఉన్నవి రెండు ఎంచారు. ఆ రెండింటిని ఆర్థిక శాస్త్రజ్ఞులు, అక్కడికి మెటీరియల్స్ చేర వెయ్యటానికయ్యే ఖర్చు, ఆ నీటి ద్వారా వచ్చే లాభం లెక్కలు కట్టి బెనిఫిట్ కాస్ట్ రేషియోస్ కట్టి లాభసాటిగా ఉన్న నందపట్నం ఎన్నిక చేసారు.

ఇండియా గ్రావిటీ డామ్స్ కట్టడం విషయంలో ఏ దేశానికి తీసిపోదు. అమెరికా అంత ఘనంగాను కట్టగలదు. డిజైను చెయ్యగలవారు, కట్టించగలవారు ఆఖరికి నిపుణులైన శ్రామికులు కూడా ఉన్నారు. కావల్సిన మెటీరియల్స్ ఉన్నాయి. అందుకనే నందపట్నం బాగుందంటే బాగుందనుకున్నారు. గ్రావిటీ డామ్ బెస్ట్ అన్నారు. రేపో ఎల్లుండో ఆ ఆనకట్ట పూర్తయి తమ పొలాలికి నీళ్లొస్తాయని రైతులుత్సాహ పడుతున్నారు.

అప్పుడు ప్రభుత్వానికి సందేహం పట్టుకుంది 'పెరటి చెట్టు మందుకి పనికొస్తుందా?' అని. తర్జన భర్జనల అనంతరం 'రాదు' అని తేల్చుకుంది. అందుకని విదేశీ నిపుణులని రావించటానికి నిర్ణయించుకుంది. అమర దేశం నుంచి ఏంజెల్ అన్న నిపుణుడు వచ్చాడు. ఇది జాతీయ భావావేశపరులు, సుశిక్షితులు అయిన ఇంజనీర్లకి, భూగర్భ శాస్త్రజ్ఞులకి, ఆర్థిక పండితులకి అవమానకరమైనదిగా కన్పించింది. అది వారి ఆత్మ విశ్వాసానికి గొడ్డలి పెట్టయింది. ఆ విషయం ప్రభుత్వం గుర్తించలేదు. మనవాళ్లే కదా ఏమి అనుకోరు అనుకుంది.

ఇంతకు ఏంజెల్‌కి పెద్ద పెద్ద డిగ్రీలు లేవు. కాని చాలా అనుభవజ్ఞుడు. అతని అభిప్రాయాలకి అమర దేశం చాలా గౌరవం ఇచ్చింది. అందుకని అతనికి మన దేశం చాలా గౌరవం ఇచ్చింది. అయితే అతని అనుభవం అంతా ఆర్చ్ డామ్స్‌లో. అతనికి భారతీయ శ్రామికుల తత్వం తెలియదు. అమర దేశంలో ఉన్నవన్నీ భారతదేశంలో ఉన్నాయని అనుకున్నాడు. మంద మతానికి చేటు. ఇంత మంది లేబరర్స్ అనవసరం అంటూ యంత్రాలు తెప్పించాడు. మాప్స్ పరీక్షించి అక్కడా అక్కడా ఇంటూలు పెట్టాడు, అవన్నీ హెలికాప్టర్‌లో వెళ్లి చూసొచ్చాడు. ఆఖరికి బక్రీ అనే ఊళ్లో 800 అడుగుల ఎత్తుగల ఆర్చ్ డామ్ కట్టాలని సూచించాడు. కాని ఆ డామ్ కట్టడానికి కావల్సిన నిపుణత మన శ్రామికులకి లేదని అతగాడు గుర్తించలేదు సరికదా మన ప్రభుత్వం కూడా గుర్తించలేదు. తనే కట్టిస్తానని, అయితే తనకి చాలా పెద్ద మొత్తం నెల జీతంగా ఇవ్వాలని, పన్నెండు నెలలకి జీతం ఇస్తే ఆరు నెలలే పని చేస్తానని షరతులు పెట్టాడు. ప్రభుత్వం సరేనంది.

డామ్ మొదలవకుండానే ఖర్చు చాలా అయింది. ఆఖరికి అతను అమర దేశం నుంచి తెప్పించిన యంత్ర సామాగ్రి బక్రీకి చేరేసరికి ఖర్చు, గ్రావిటీ డామ్ కయ్యే ఖర్చును మించి పోయింది. ఆపైన ఉన్న శ్రామికులతో ఎల్లా పని చేయించుకోవాలో ఏంజెల్‌కి తెలియలేదు. యంత్రసామాగ్రి పాడైపోతే స్పేర్‌లు లేకపోతే ఎల్లా సరిపెట్టుకోవాలో అతగాడికి తెలియలేదు. వాళ్ల దేశంలో ఫోన్ చేస్తే, అన్ని వాకిట్లో వచ్చి వాల్తాయి. అతను దానికే అలవాటు పడ్డాడు. ఆఖరికి ఇండియన్ ఇంజినీర్లు రంగంలోకి దిగి ఉన్న మనుషులతో, ఉన్న పరికరాలతో వస్తువులతో ఆ డామ్ కట్టడం పూర్తి చేసారు.

ఒక భూమిలో పెరిగే మొక్కని తీసుకు వెళ్లి మరో దేశంలో పాతితే ఏమౌతుందో అదే అయింది. బెజవాడలో ఆపిల్ చెట్టు కాయనట్టే ఆ డామ్ బక్రీలో సరిగా నిలదొక్కుకోలేదు. అది భారతీయుల తప్పు కాదు. పెరటిచెట్టని అనుమానించి దాన్ని వాడక, అమర దేశం నుంచి మందనుకుని దూలగుండాకు తెప్పించి వాడిన ప్రభుత్వానిది. విదేశీయ నిపుణుడిని ఏమనలేక నోరు మూసుగుంది. ప్రతియేడు బక్రీ డామ్‌లో ఈ భాగం పడిపోయింది, ఆ భాగం పనిచేయ టం లేదు అన్న పత్రికావార్తలు చదవటానికి నందగిరి రాష్ట్ర ప్రజలు అలవాటుపడి పోయారు.

## ఉపసంహారం :

పెరటి చెట్టు మందుకు పనికిరాదని అనుకోడం మానేస్తే భారతీయ నిపుణుల ఆత్మ

విశ్వాసానికి దోహదం చేసిందవుతుంది ప్రభుత్వం.

నిపుణులు నీటికికాక శంఖానికిచ్చే విలువకి బాధపడ్డారు. పులులు ఏవో, పులితోలు కప్పుకున్న గాడిదలు ఏవో ప్రభుత్వం తెల్సుకోవాలి. దానికి పులులు సహాయం చెయ్యాలి.

అబద్దపు రిపోర్టులతో సత్యాన్ని వధించటం, అర్హతలేని ప్రాజెక్టులని ప్రాంతీయాభిమానంతో సమర్థించటం నిపుణులు మానుకోవాలి.

అప్పుడే నిజంగా 'గరీబీ హటావో' అంటే అది పోతుంది.

*-ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, '73*

★

# ఉద్యోగ కవనాలు

## వడ్డించే మన వాళ్ళ కథలు

ఉపోద్ఘాతం

అయ్యా! ఉద్యోగ నీతిజ్ఞుడు గారూ!

1. మనిషికి సరిపడు చొక్కా కథ
2. కడివెడు ఖరము పాలు కథ
3. విసుగు చెందని విక్రమార్కుడి కథ
4. ఆషాఢభూతి అన్న కథ